www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
బుధవారం | 11 | నవంబర్ | 2026 | పేజీలు: 08



ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి

నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలి

విద్యార్థులు ఫిట్‌నెస్ ఆరోగ్యం, చదువులకు ప్రాధాన్యత ఇవ్వాలి

కలెక్టర్ బి. చంద్రశేఖర్



హాలియా, అక్షిత ప్రతినిధి: ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించు కోవాలని, నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించి పొదుపు సూత్రాలను పాటించేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ప్రతి విద్యార్థిని నీటి సంరక్షణలో ఒక వారియర్ గా ఎదగాలని, ఫిట్‌నెస్, ఆరోగ్యం, చదువు అనే మూడు అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మంగళవారం అనుముల మండలం హాలియాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి పాఠశాలలో నీటిని పొదుపుగా వినియోగించాలని, మంచినీటిని వృథా చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో వాటర్ సంపు ఉందా అని అడిగి తెలుసుకున్నారు. వృథాగా వెళ్లే నీటిని తిరిగి వినియోగించుకునేందుకు డ్రై డ్రెయిన్, సోక్‌పిట్ ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఎస్ కమిటీ ద్వారా తీర్మానం చేయించి కరెక్ట్ కలెక్టర్ నిధులు ద్వారా ఇస్తా మన్నారు. పొదుపు సూత్రాలను అమలు చేయాలని, ఎంత నీరు అవసరమో అంతే వినియోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని ..మిగతా 2లో



సిద్ధిపేటలో సంక్షేమ సందడి!

ఇందిరమ్మ బీమాకు శ్రీకారం

19న భారీ బహిరంగ సభ..

మహిళలకు చీరల పంపిణీ

సీఎం రేవంత్ రెడ్డి రాక

సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి

సిద్దిపేట, అక్షిత బ్యూరో: ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో సభా స్థలి ఎంపిక, ఏర్పాట్ల కోసం ..మిగతా 2లో

ఆధ్యాత్మిక పరవళ్ళు

వేయి స్తంభాల గుడిలో కార్తీక మాస సందడి

పరమశివుడిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



కాజీపేట్, అక్షిత ప్రతినిధి : హనుమకొండలోని చారిత్రక శ్రీ రుద్రేశ్వర స్వామి (వేయి స్తంభాల దేవాలయం) ఆలయంలో కార్తీక మాసోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పక్షాన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక మాసోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ..మిగతా 2లో

చిన్నారులకు తల్లిపాలు శ్రేష్టం

చిరుధాన్యాలతో పౌష్టికాహారం

కలెక్టర్ ఖుష్బూ గుప్తా





మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి: చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాల ప్రాధాన్యత, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పిల్లల అభివృద్ధి దశలపై తల్లులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. చిన్నారుల్లో ఎదుగుదల లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి ..మిగతా 2లో

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి



మొదటి పేజీ తరువాయి...

ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ఎలా సమర్థవంతంగా వినియోగించుకోవాలో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని, ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం 6 వ తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడారు. పాఠ్యపుస్తకంలోని టూర్ ప్రోగ్రాం పాఠాన్ని చదివించి, వారు ఎక్కడికి వెళ్లారు, ఏం తెలుసుకున్నారని ప్రశ్నించారు. బతుకమ్మ సందర్భంగా టూర్‌కు వెళ్లామని విద్యార్థినులు తెలిపారు.

హిందీ భాషపై ఆసక్తి పెంపొందించేందుకు హిందీ అక్షరాలను బోర్డుపై రాయించి పరిశీలించారు. చక్కగా రాసిన విద్యార్థినులను అభినందించారు.6 తరగతి నుండి 10 తరగతి వరకు ప్రతి విద్యార్థిని పాఠశాల కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని, స్టేజ్ ఫియర్ పోగొట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.ప్రార్థన సమయంలో సూక్తులు, జనరల్ నాలెడ్జ్, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థికి మాట్లాడే అవకాశం కల్పించాలని అన్నారు. వారంలో రెండుసార్లు నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించాలని, ప్రతిరోజూ సాయంత్రం నీటి పొదుపు సూత్రాలను గుర్తు చేసేలా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు కలెక్టర్ హిందీలో ఒక కవితను వినిపిస్తూ, ఈరోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేయాలని, రేపు చేయాల్సిన పనిని ఈరోజే పూర్తి చేయాలనే సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థులు ఎవరికీ భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.ప్రతి విద్యార్థిని ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలని, ఈ మూడు అంశాలను జీవితంలో తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు యూనిఫాంలు, షూస్ వచ్చాయా అని అడిగి తెలుసుకోగా వచ్చినట్లు విద్యార్థినులు తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థినికి జనన ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, లేని వారికి వెంటనే మీ సేవ ద్వారా దరఖాస్తు చేసి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతలను అలవర్చాలని, పాఠశాలను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ కుకడాల హైమావతి కలెక్టర్ వెంట ఉన్నారు.

ఆధ్యాత్మిక పరవళ్ళు



మొదటి పేజీ తరువాయి...

కార్తీక మాసం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, భక్తిభావాన్ని పెంపొందించే అత్యంత పవిత్రమైన మాసమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు కులమతాలకు అతీతంగా సామూహికంగా దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం ఈ మాసం ప్రత్యేకత అని తెలిపారు. ఎంతో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన వేయి స్తంభాల దేవాలయంలో పరమశివుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో
సంక్షేమ సందడి!



మొదటి పేజీ తరువాయి...

మంత్రులు పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకట్ స్వామి పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, రాకపోకలకు అనువైన ప్రాంతాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హైమావతి, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నవంబర్ 19న సిద్దిపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఈ పథకం ప్రజలకు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళలకు చిలకపచ్చ రంగు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సభా వేదికగా ప్రజలకు వివరిస్తారని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు బోనస్, రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలు వివరాలను వెల్లడిస్తారని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన అంశంతో పాటు ఉద్యోగ నియామకాలు, పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తి తదితర కార్యక్రమాల గురించి కూడా ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాలతో పాటు ఇంకా అమలు చేయాల్సిన కార్యక్రమాలపై కూడా ముఖ్యమంత్రి స్పష్టత ఇస్తారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేటతో పాటు దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల తదితర నియోజకవర్గాల నుంచి ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ.. నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన నేపథ్యంలో సభా ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్, రవాణా, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, నూతన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ఈ సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సభ వేదికగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని వెల్లడించారు. అలాగే 20 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 19న సిద్దిపేటలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి పిలుపునిచ్చారు.

చిన్నారులకు తల్లిపాలు శ్రేష్టం

మొదటి పేజీ తరువాయి...

అవసరమైన వైద్య చికిత్స అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

జాతీయ పోషణ మాసం (పోషణ్ మాహ్) కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్టేట్ హోమ్‌లో 'మన అంగన్‌వాడీ -- మన బాధ్యత' అనే థీమ్ తో నిర్వహించిన ఆరోగ్యలక్ష్మి (సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం), అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

శిశువు జన్మించినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని కలెక్టర్ సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. తల్లిపాలు తగినంతగా ఉత్పత్తి కావాలంటే బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. గర్భిణులు వైద్యుల సూచనల మేరకు ఐరన్, కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా తీసుకోవాలని, పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు చిన్నారులకు అదనపు పోషకాహారం అందించాలని, రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. రెండేళ్లలోపు పిల్లలకు అధిక ఉప్పు, చక్కెర కలిగిన పదార్థాలు, ప్యాకెట్



ఆహారాలు, శీతల పానీయాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అరటిపండ్లు, చిరుధాన్యాలతో తయారు చేసిన జావ, పప్పులు, కూరగాయలు వంటి సహజసిద్ధమైన పోషకాహారం అందించాలని సూచించారు.

పుట్టినరోజు వేడుకలు, శుభకార్యాలు, పాఠశాలల్లో పిల్లలు చిప్స్, చాక్లెట్లు, శీతల పానీయాలకు అలవాటు పడుతున్నారని, వీటిని తరచూ తీసుకోవడం వల్ల వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పిల్లలకు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం గుడ్లు, అన్నం, పప్పు, కూరగాయలు తదితర ఆహార పదార్థాలను నాణ్యతతో, తగిన పరిమాణంలో అందించాలని కార్యకర్తలకు సూచించారు. పప్పులో బీరకాయ, పాలకూర, గోంగూర, మెంతికూర వంటి ఆకుకూరలు, కూరగాయలు కలిపి వండడం ద్వారా పోషక విలువలు పెరుగుతాయని తెలిపారు. పిల్లలు ఆహారం తినడం లేదనే కారణంతో దాని నాణ్యత, పోషక విలువల్లో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహార నాణ్యతను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రీ ప్రైమరీ విద్య బాధ్యతలు విద్యాశాఖకు బదిలీ అయినప్పటికీ, చిన్నారులకు పోషకాహారం అందించే బాధ్యత మహిళా, శిశు సంక్షేమ శాఖపైనే కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది చెప్పే విషయాలకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇస్తారని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

అనంతరం తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించిన శ్రీమంతం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని గర్భిణులు, చిన్నారుల తల్లులకు పండ్లు, పూలు, గాజులు, చీరలను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఇంటికీ సరైన పోషణ, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ పోషణ అభియాన్‌ను దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను కలెక్టర్ సందర్శించి, వివిధ రకాల పోషక విలువలున్న ఆహార పదార్థాలను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, సి.డి.పి.ఓ లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములు తీసుకొని నీళ్లు పరిశ్రమలకు మళ్లిస్తే ఊరుకునేది లేదు!

ఎకరాకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి..

ప్రతి ఎకరాకు సాగునీటి హామీని లిఖితపూర్వకంగా ప్రకటించాలి

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు భూసేకరణ గ్రామసభ

బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు భూసేకరణ విషయంలో రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల భూములు సేకరించి ప్రాజెక్టు నిర్మించిన తర్వాత ఆ నీటిని పరిశ్రమలకు, డేటా సెంటర్లకు మళ్లించి వ్యవసాయానికి అన్యాయం చేస్తే ఎలా అని ప్రశ్నించారు. రైతుల భూములకు ఎకరాకు రూ.40 లక్షలు సరిపోవని, ఎకరాకు రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూసేకరణ గ్రామసభలో రైతుల పక్షాన ఆయన పలు కీలక అంశాలను లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీశారు.

రైతుకు భూమి అంటే కేవలం ఆస్తి కాదని, అది తరతరాల కుటుంబ చరిత్ర, జీవనాధారమని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. తాతముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన భూములు, పూర్వీకుల సమాధులు, కుటుంబ జ్ఞాపకాలు, ఆ భూములకు ఉన్న అనుబంధాలను కేవలం పరిహారం లెక్కలతో వెలకట్టలేరన్నారు. సుప్రీంకోర్టు సైతం భూసేకరణలో బాధితుల ప్రయోజనాలు, మానవీయ దృక్పథం, న్యాయమైన పరిహారం ప్రాధాన్యతను గుర్తించిందని పేర్కొంటూ ప్రభుత్వం రైతుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

సాగునీటి హామీపై సంతకాలు పెట్టే దమ్ముందా?

రైతులు తమ భూములను త్యాగం చేస్తున్నది ఇతర ప్రాంతాల రైతులకు సాగునీరు అందాలనే ఆశయంతోనేనని పేర్కొన్నారు. పద్మారం ప్రాంత రైతులు భూములు కోల్పోతూ దిగువ ప్రాంతాల వ్యవసాయానికి నీరు అందాలని కోరుకుంటున్నారని తెలిపారు. అయితే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందనే హామీని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ లిఖితపూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాటలతో కాకుండా అధికారిక హామీతో రైతులకు భరోసా కల్పించాలని స్పష్టం చేశారు.

డేటా సెంటర్లకు నీళ్ల మళ్లింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి!

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నీటిని డేటా సెంటర్లకు మళ్లిస్తారనే సందేహాలు రైతుల్లో ఉన్నాయని, వాటిపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది ఆరోపణ కాదని, రైతుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రైతుల నుంచి భూములు సేకరించి నిర్మించే ప్రాజెక్టు నీటిని వ్యవసాయ అవసరాలకే ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించే ఆలోచన ఉంటే ముందుగానే స్పష్టంగా ప్రకటించాలని కోరారు.

రైతులకే కాదు.. కూలీల కుటుంబాలకూ పరిహారం ఏది?

సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూములు సేకరిస్తే ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రైతులకు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, వ్యవసాయ పనులు కోల్పోయే కూలీల కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి, జీవన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేవలం భూముల విలువను లెక్కించకుండా రైతుల కుటుంబాల భవిష్యత్తు, భావోద్వేగాలు, వ్యవసాయ కూలీల జీవనోపాధి, గ్రామీణ వ్యవస్థపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏదిర రాజు, వీరన్నపేట ఉపసర్పంచ్ పరిగి శివకుమార్, జిల్లా సామాజిక మాధ్యమాల కన్వీనర్ మాల నవీన్, గొల్ల మల్లేష్, రవీందర్ రెడ్డి, భీమయ్య, మండల కార్యదర్శి నరేష్, చనగల యాదగిరి, జె. నరేష్, గిరిజన మోర్చా అధ్యక్షుడు విట్టల్, కృష్ణయ్య,

ఫాతిమా సెంటర్‌లో ట్రాఫిక్ కోన్లు, బార్కెట్లు ఏర్పాటు

కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పిట్టల వెంకన్న



కాజీపేట్, అక్షిత ప్రతినిధి : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కాజీపేట పట్టణంలో మంగళవారం ఫాతిమా సెంటర్ నందు రోజు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీదృష్ట మరియు ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండుటకు గాను తాత్కాలికంగా రోడ్డుపై ట్రాఫిక్ కోన్లు, బార్కెట్లు ఏర్పాటుచేసి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడం జరిగినది. నో రైట్ టర్న్, నో యు టర్న్ సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. కావున ప్రజలు గమనించి దీనికి అనుగుణంగా తమ ప్రయాణాలను కొనసాగించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, స్థానిక ట్రాఫిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవల కోసం 6 లక్షల ఎల్ ఓ సి అందజేసిన కల్వకుర్తి శాసనసభ్యులు కశిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన గుంత శిరీష అంజనేయులు దంపతుల కుమారుడు గుంత సాకేత్ కు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మంగళవారం నాడు హైదరాబాదులోని వారి స్వగృహంలో ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారుడు గుంత అంజనేయులు కుటుంబ సభ్యులకు 600000-00 ఆరు లక్షల ఎల్ఓసి అందజేశారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని ఆలోచనతో ఎల్ఓసి అందజేస్తుందని,ఎల్ఓసి సహాయం బాధిత కుటుంబాలకుఎంతో ఊరట నిస్తుందని అన్నారు.ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తానని కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.ఎల్ ఓ సి అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి మాజీ ఎంపిటిసి ఏం అంబాజీ,మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ,అంజయ్య గౌడ్,మాజి ఉపసర్పంచ్ లు.బి,నర్సింలు,అజీజ్,నాయకులు ఏ,వెంకట్ రెడ్డి, ఎం.డి.ఆరిఫ్ వద్దే రాజు పులిజాల విష్ణు తదితరులు పాల్గొన్నారు

వెట్టి చాకిరి నుండి విముక్తి కల్పించారు

తిరిగి మళ్లీ యజమానులు దాడికి దిగుతున్నారు

గొర్రెల కాపరి యజమాని నుండి రక్షణ కల్పించండి



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: నాగర్ కర్నూల్ జిల్లా మరియు మండలం బొందలపల్లి గ్రామానికి చెందిన శడిగల జాషువా అనే బాబు వయసు (14)సంవత్సరాలు తండ్రి పేరు నాగేష్(కొడుకును భార్యను వదిలేసి వెళ్ళి పోయాడు). తల్లి పేరు కోటేశ్వరమ్మ ఈమెకు కండ్లు కనిపించవు. వీరిది ఎస్సీ మాదిగ కులం, తల్లి ఆరోగ్యం కోసం చేసినటువంటి అప్పు 80 వేల రూపాయలకు కొడుకును ,వారి కమ్యూనిటీకి చెందినటువంటి గడ్డి కుర్మయ్య అనే వ్యక్తి దగ్గర 80 వేల రూపాయల అప్పు తీసుకొని, 30 గొర్ల దగ్గర గత నాలుగు నెలల నుంచి జీతం పెట్టడం జరిగింది. తల్లి చేసినటువంటి అప్పు కింద కొడుకు పని చేస్తుంటే గ్రామస్తులు ఇచ్చినటువంటి సమాచారం మేరకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 వాళ్ళు బాబును రిస్క్యూ చేసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మరియు ఆర్డీవో ముందు హాజరు పరిచి బాబు ను నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతిలో చేర్పించడం జరిగింది. కానీ యజమాని మిగతా అప్పు కింద బాబును లేదా తల్లిని పనిలోకి రావాలని భయభ్రాంతులకు గురి చేస్తూ వేధిస్తున్నారు. కావున యజమాని నుంచి విముక్తి కల్పించగలరని కోరుచున్నాము.

రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ చెక్

అందించిన జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐపీఎస్



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, గత సంవత్సరం దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి కుటుంబానికి పోలీస్ భద్రత వెల్ఫేర్ అసోసియేషన్ మంజూరు చేసిన రూ. 5,00,000 (ఐదు లక్షల రూపాయల) పర్సనల్ ఇన్సూరెన్స్ చెక్కును జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐపీఎస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో అకాల మరణం చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలను ఆదుకోవడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి సేవలను గుర్తుచేసుకుంటూ, వారి కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏ.వో కృష్ణయ్య, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, జిల్లా పోలీస్ కోఆర్డినేటర్ గోలి.శ్రీనివాస్ మరియు మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విలువలు విజయాలకు ప్రతీక స్వేరో ఆర్గనైజేషన్

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్



కాజీపేట్, అక్షిత ప్రతినిధి : స్వేరో ఆత్మీయ సమ్మేళనం కన్వీనర్ మంద శ్యామ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం వద్ద స్వేరో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం రోజున నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ హాజరు అయ్యారు అనంతరం పార్టీ శ్రేణులు, స్వేరో సభ్యులతో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు

ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం రాసిన భారత రత్న డా. బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానం, స్ఫూర్తితో తెలంగాణ ప్రజలకు ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.కేసీఆర్ 1000 పైగా గురుకులాలను ఏర్పాటు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉన్నత విద్య అందేలా కృషి చేశారు అన్నారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో చదివిన ఎందరో విద్యార్థులు గొప్పగా ఎదిగారని తెలిపారు పూర్ణ, ఆనంద్ ఎవరెస్టు అధిరోహించారని, వేలాది విద్యార్థులు డాక్టర్స్, ఇంజనీర్స్ అయ్యారని వివరించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వేరో ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, మాజీ ఐపీఎస్ అధికారి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతారని అన్నారు.స్వేరో సంస్థ బహుజనుల ఆర్థికం ఆత్మగౌరవం ఆకాంక్షలు మేరకు పని చేస్తుందని తెలిపారు.

ధాన్యం ధర తగ్గించొద్దు

రైతులను ఆదుకోవాలి



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి : రైతులకు అండగా ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.4,000లకు తగ్గకుండా రైస్ మిల్లర్లు కొనుగోలు చేయాలని ఎంసిపిఐయు కేంద్ర కమిటీ సభ్యులు, ఆలిండియా కిసాన్ సభ నాయకులు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో రైస్ మిల్లర్లు ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారున్నారు. రైతులు, మిల్లర్లకు నష్టం కలగకుండా ధాన్యం క్వింటాల్‌కు రూ.4,000 తగ్గకుండా కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లను కోరారు. ఒక ప్రక్క ఎల్ నీనో కరువు, మరో ప్రక్క సాగు నీటి ఇబ్బందులతో అధిక పెట్టుబడి పెట్టి రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన వెంట ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి,నాయకులు మోహన్ నాయక్, భరత్ తదితరులు న్నారు

అఖిలభారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు
జయప్రదం చేయండి



కొమురవెల్లి అక్షిత న్యూస్: నల్లగొండ పట్టణంలో ఈ నెల 15 నుంచి 18 వరకు మహాసభలుజరుగుతాయి మోడీ ప్రభుత్వం పూర్తిగా అమెరికాకులొంగిపోయింది భారత రైతాంగానికిగిట్టు బాటు ధర లేక అల్లాడుతున్నారు.

దేశంలోరైతుఆత్మహత్యలు పెరిగిపోయాయి .రైతు వ్యతిరేక నిర్ణయాలతో మోడీ పాలన రైతు హక్కులను కాపాడడానికి ఈ మహాసభలుసిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు.అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు నల్లగొండ పట్టణంలోజరుగుతాయని సిఐటియురాష్ట్రఅధ్యక్షులు చుక్కారాములుతెలిపారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కొమరవెల్లి మండల కేంద్రంలో 36వమహాసభలను విజయవంతం చేయడానికి మద్దతుగా రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేలాది మందితో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి తో కలిసి మాట్లాడుతూ అఖిల భారత కిసాన్ సభ 36వజాతీయమహాసభలు ఈనెల 15 నుండి 18 వరకు నల్గొండ పట్టణంలో జరుగుతాయని దీనికి దేశవ్యాప్తంగా రైతు సమస్యలపైపోరాడుతున్న 1000 మందికి పైగా ప్రతినిధులులక్షలాదిమంది రైతులు హాజరవుతారని తెలిపారు. మొదటిరోజు భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ఈ సభకు అఖిలభారత నాయకులు కామ్రేడ్ బృందాకారత్ హాజరవుతారనితెలిపారు. కేంద్ర ప్రభుత్వం 32 దేశాల వ్యవసాయ ఉత్పత్తులను మనదేశంలో కి దిగుమతి కి అనుమతించడంతో మన దేశ రైతాంగం భారీగా నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దేశంలో రైతు ఆత్మహత్యలు జరుగుతా ఉన్నాయని, వీటిని నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛ వాణిజ్యఒప్పందాల పేరిట మోడీ ప్రభుత్వం పూర్తిగా అమెరికాకు లొంగిపోయిందని ఇప్పటికే అమెరికా,బ్రిటన్,న్యూజిలాండ్ దేశాలతోటి ఈ ఒప్పందాలు చేసుకుందని దీంతో మన దేశ పాడి, పౌల్ట్రీ పరిశ్రమకు పెను ప్రమాదం పొంచి ఉందని తెలిపారు.విద్యుత్ సవరణ బిల్లు 2025, విత్తన చట్టం సవరణ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టారని, ఈ రెండు చట్టాలు అమలు అయితే భారతదేశ రైతులుతీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ రంగం పూర్తిగా ప్రైవేటు రంగం చేతిలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయంలో కార్పొరేట్ రంగాన్నిపూర్తిగావ్యతిరేకిస్తూ మన రైతుల్ని కాపాడుకోవాల్సినఅవసరం ఉందని చెప్పారు. దేశంలో రైతులుపండించిన పంటలకు గిట్టుబాటు ధర కోసం డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ అఖిల భారత రైతు సంఘం మహాసభలలో పై సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి భారత రైతాంగాన్నిఆదుకోవడానికి రైతు మహాసభలు దోహదపడతాయిఅన్నారు ఈ మహాసభలను విజయవంతం చేయడానికి ఈనెల 15 న రైతాంగం పెద్ద ఎత్తున నల్గొండకు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట్, మావో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిల్లా ఉపాధ్యక్షులు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు,రైతు సంఘం రాష్ట్ర కమిటి సభ్యురాలు,మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రైతు సంఘం జిల్లా నాయకులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, చుంచనకోట సర్పంచ్ గొర్రె శ్రీనివాస్, కెవిపిఎస్ నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్య దేవ సహిత అయ్యప్ప దేవాలయ అధ్యక్షుడిగా దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి

ప్రధాన కార్యదర్శిగా తూర్పాటి శంకర్

ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తా...

చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్ /అక్షిత న్యూస్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ ముగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా వారి సమక్షంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి గురు స్వామి, మాజీ దేవాలయ అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్, మాజీ దేవాలయ ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు పర్యవేక్షణలో నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్నిక ప్రకటనను మున్సిపల్ చైర్మన్ మోగదాల పావని రమేష్ గౌడ్ నూతన అధ్యక్షుడిగా దేవరపల్లి గోవర్ధన్ రెడ్డిని, ప్రధాన కార్యదర్శి గా తూర్పాటి శంకర్ ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణం జరిగిందని తెలిపారు. నూతన కమిటీ అందర్నీ కలుపుకొని ఆలయ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని తెలిపారు. ఆలయ అభివృద్ధి విషయంలో తమ పంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. దేవాలయ నిర్మాణం కొరకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందిస్తూ కొనియాడారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను శాలువాలతో ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగుదాల రమేష్ గౌడ్,దేవాలయ సలహాదారులు దాచేపల్లి ప్రకాష్ గుప్తా, అయ్యప్ప స్వామి విగ్రహ ధాత కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కంచరకుంట్ల వెంకటరెడ్డి ఉప్పు ఆంజనేయులు అంతటి రాము గౌడ్, తాడూరు పరమేష్, పెద్ద గోని రమేష్ గౌడ్, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, ఎలుగుబెల్లి అనిల్ కర్నాటి శ్యాంప్రసాద్, సుక్క సుదర్శన్, డాక్టర్ అనిల్, తిరందాసు జగన్నాథ్, బొడ్డు రాజేందర్ రెడ్డి, మలిగే శ్రీను, తూర్పునూరు నరసింహ గౌడ్, శశి, బోరం ప్రకాష్ రెడ్డి,దేవాలయ అర్చకులు ఓంకార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గాలి శ్రీనివాస్ నాయుడు సన్నిధానంలో అయ్యప్ప స్వాములకు మహా అన్నదానం

అన్నదానాలు పుణ్యకార్యాలు

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ప్రాంగణం..



కోదాడ అక్షిత ప్రతినిధి: అయ్యప్ప స్వాముల సేవే మాధవ సేవ అనే సంకల్పంతో గాలి శ్రీనివాస్ నాయుడు సన్నిధానంలో రెండవ రోజు సుమారు 800 మంది అయ్యప్ప స్వాములకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి అయ్యప్ప స్వాముల సమక్షంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 13 సంవత్సరాలుగా నిరంతరంగా అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించడం ఎంతో గొప్ప పుణ్యకార్యమని కొనియాడారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవ మరొకటి లేదని, భక్తితో పాటు సేవాభావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. గాలి శ్రీనివాస్ నాయుడు చేస్తున్న ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని ప్రశంసించారు.

అనంతరం అయ్యప్ప నామస్మరణ, భజనలు, స్వామివారి నినాదాల మధ్య అన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర పుల్లారెడ్డి సుధారాణి వారి కుమారుడు ప్రమోద్ రెడ్డిల ఆర్థిక సహకారంతో పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. 13 ఏళ్లుగా నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గాలి శ్రీనివాస్ నాయుడును అయ్యప్ప స్వాములు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తి, సేవ, దాతృత్వం కలగలిపిన ఈ మహా అన్నదాన కార్యక్రమం భక్తుల మధ్య ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది. అన్నదాన సేవకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పలువురు ఆకాంక్షించారు. 60 రోజులపాటు నిరంతరంగా జరిగే అన్నదానాన్ని మాలలు ధరించిన స్వాములు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు గాలి శ్రీనివాస్ నాయుడు సీతారాం సింగ్ గంగిరెడ్డి రాకేష్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో దేవాలయ గురు స్వాములు స్థానిక ప్రముఖులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

మద్దిమడుగు గ్రామ అభివృద్ధికి

పకడ్బంది చర్యలు

అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

భూభారతి కార్యక్రమంలో భాగంగా భూ రీ సర్వేను నెల రోజుల్లో పూర్తి చేయాలి

మద్దిమడుగు గ్రామంలో భూ రీ సర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్





నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం, పదర మండలం మద్దిమడుగు గ్రామంలో భూభారతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన భూ రీ సర్వే అవగాహన సదస్సులో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో, లతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొని గ్రామస్తులకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు.

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ..... మద్దిమడుగు గ్రామానికి ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, భవిష్యత్తులో గ్రామం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో గ్రామ పరిధిలో భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతతో, పకడ్బందీగా నిర్వహించి నెల రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

గ్రామ పరిధిలోని అటవీ, రెవెన్యూ భూముల మధ్య ఉన్న సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టంగా గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గతంలో భూ సరిహద్దుల విషయంలో తలెత్తిన సమస్యలు, అపోహలు, వివాదాలను గుర్తించి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అందుబాటులో ఉన్న భూ రికార్డులు, మ్యాపులు, ఇతర ఆధారాలను పరిశీలించి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

భూ రీ సర్వే కేవలం భూముల కొలతలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు తావులేకుండా స్పష్టమైన రికార్డులు రూపొందించేలా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే సమయంలో గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని, వారికి పూర్తి వివరాలు తెలియజేస్తూ వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

సర్వే పూర్తయిన అనంతరం మరోసారి గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు, సమస్యలు, సూచనలు స్వీకరించాలని తెలిపారు. సంబంధిత శాఖల నివేదికలు, భూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. గ్రామస్తులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర హక్కు పత్రాలు, అందుబాటులో ఉన్న రికార్డులను అధికారులకు అందించి సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయంతో భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో అనవసర వివాదాలను నివారించవచ్చని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి ఒక్కరి భూ హక్కులకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా, గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో స్థల ఎంపికతో పాటు అవసరమైన ఏర్పాట్లపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, గ్రామ సర్పంచ్‌తో కలిసి మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి

మాజీ ఎమ్మెల్యే

బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్

చిలుకూరు, నవంబర్ 10, (అక్షిత న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని, దళారులు, వ్యాపారస్తుల దోపిడీని అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రంలో పర్యటించిన ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతుల పంట పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడి సాయం, సాగునీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడినా, ఆకాశాన్ని నమ్ముకుని రైతులు వరి సాగు చేశారని పేర్కొన్నారు. రైతుబంధు అందకపోవడం, యూరియా కొరత, సాగునీటి సమస్యలు రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సాకుగా చూపుతూ వ్యాపారులు రైతుల నుంచి తూకం, తాలు



పేరుతో బస్తాకు 2.5 కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆరోపించారు. గతంలో క్వింటాల్ ధాన్యానికి రూ. 4,200 వరకు ధర పలకగా, ప్రస్తుతం రూ. 3,200కు తగ్గించారని, దీంతో రైతులు క్వింటాలుకు రూ.వెయ్యి వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, మరోవైపు మార్కెట్లో బియ్యం ధరలు పెరిగి కిలో రూ. 90 దాటుతున్నాయని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టి రైతులకు కనీస మద్దతు ధర అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్న ప్రభుత్వ సూచనలతో వరి సాగు చేయకుండా పొలాలను ఖాళీగా ఉంచిన రైతులకు ఇప్పటివరకు కరువు భత్యం అందలేదని విమర్శించారు. కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో పంట నష్టపరిహారంతో పాటు కరువు భత్యం వెంటనే చెల్లించాలని కోరారు. తుఫానులు, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులు, రైతు కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, దళారుల దోపిడీని అరికట్టి ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అక్కినపల్లి జానకి రామాచారి, పిఏసిఎస్ చైర్మన్ అలసగాని జనార్ధన్, బెల్లంకొండ నాగయ్య, మాజీ యంపిపి కోండా అన్నపూర్ణ, అంబాల వెంకటి,షేక్ పాషా, లింగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులునిగిడాల. విరయ్య, బుడిగెం.కిశోర్,తిపిరిశెట్టి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన గోలి శ్రీనివాస్ రెడ్డి

మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ కుమార్తె వివాహానికి కేటీఆర్ కు ఆహ్వానం



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్‌ను తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంపై చర్చించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని గోలి శ్రీనివాస్ రెడ్డికి కేటీఆర్ సూచించారు.వారితో పాటుమాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ ఉన్నారు.కార్యక్రమంలో కల్వకుర్తి మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సింగం విజయ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,నాయకులు సుభాష్, బుచ్చిబాబు,బుజ్జి,శేఖర్,పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

కేంద్ర మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతుల పెళ్లిరోజు వేడుకలు

కరీంనగర్ అక్షిత బ్యూరో: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ – స్వర్ణలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం కరీంనగర్ నగరంలోని కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ మేయర్ దంపతులను శాలువాతో సత్కరించి, పూల మొక్కను బహుకరించి హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ – స్వర్ణలత దంపతులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు గౌరవ పూర్వకంగా శాలువా కప్పి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. మరో వైపు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మేయర్ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



చింతాబాబు మాదిగకు 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్' జాతీయ పురస్కారం.....

సామాజిక, బహుజన సేవలకు లభించిన అత్యుత్తమ గుర్తింపు...



కోదాడ అక్షిత ప్రతినిధి: బహుజన హక్కుల పోరాట యోధుడు, ఎమ్మార్పీఎస్ కీలక నేత చింతాబాబు మాదిగను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు వరించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ఈ పురస్కారాన్ని ప్రకటించగా, ఈ నెల 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు చింతాబాబు మంగళవారం వెల్లడించారు.గత మూడు దశాబ్దాలుగా సామాజిక రంగంలో చింతాబాబు సేవలు అందిస్తున్నారు. 1990లలో మార్గదర్శి యూత్, స్ఫూర్తి యూత్ సంస్థల ద్వారా యువతను చైతన్యపరుస్తూ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గతంలో ఫ్రెండ్‌షిప్ సొసైటీ అవార్డులు, 'దళిత రత్న' పురస్కారం పొందడంతో పాటు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా 'మాదిగ బంధు' బిరుదును అందుకున్నారు. జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు ప్రకటనపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కరీంనగర్‌లో ఘనంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ స్వర్ణలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

లయన్స్ క్లబ్, గౌరిశెట్టి చారిటబుల్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ చేసిన మేయర్ దంపతులు



కరీంనగర్ అక్షిత బ్యూరో: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ – స్వర్ణలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు కరీంనగర్ లో ఘనంగా జరిగాయి. మంగళవారం నగరంలోని వెంకటేశ్వర టెంపుల్ చౌరస్తా లో లయన్స్ క్లబ్ కరీంనగర్ పౌండేషన్ ఆధ్వర్యంలో వివాహ వార్షికోత్సవం సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతులు తన చేతుల మీదుగా అన్నదాన వితరణ చేశారు. అనంతరం నగరంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో గౌరిశెట్టి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హాస్పిటల్ లో ఉండే రోగులు వారి బంధువులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ స్వర్ణలత దంపతుల తమ చేతుల మీదుగా అన్నదానం చేశారు. అనంతరం లయన్స్ క్లబ్, గౌరిశెట్టి మెమోరియల్ ట్రస్ట్ సంస్థల నిర్వాహకులు మేయర్ దంపతులను గౌరవంగా సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మరో వైపు నగరంలోని తీగలగుట్ట పల్లి క్యాంపు కార్యాలయంలో మేయర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. పలువురు పాలకవర్గ సభ్యులు మేయర్ దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సిద్దిపేటలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి



కొమురవెల్లి అక్షిత న్యూస్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగానిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా సభ నిర్వహణ, ప్రజల రాకపోకలు, నాయకులు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించి,సభకుసంబంధించినఏర్పాట్లనుక్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం జరిగింది.ఈ నెల 19న నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ చీరల పంపిణీ, కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ల పంపిణీతో పాటు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వంటి ప్రజా సంక్షేమకార్యక్రమాలు ఉండనున్నాయి.ఈ కార్యక్రమంలో చేర్యాల ఏఎంసి చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, చేర్యాల మండల అధ్యక్షులు మంజమల్లేశం, చేర్యాల పట్టణ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, ధూలిమిట్ట మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్,మద్దూర్ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ బోయిన్ శ్రీనివాస్ తో పాటు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగం రెడ్డి, సుదర్శన్ రెడ్డి, చెరుకు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి

విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు అందించాలి

ఇంటర్మీడియట్‌లో 100 శాతం ప్రవేశాలు నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా ప్రమాణాలు, సౌకర్యవంతమైన వసతి, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి విద్యా ప్రగతికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

మంగళవారం అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన, భోజన ఏర్పాట్లు, ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణ, విద్యార్థుల ప్రవేశాల నమోదు తదితర అంశాలను పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల ప్రత్యేక అధికారిని కుసుమ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కేజీబీవీ పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం ఎంతో ముఖ్యమని, నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయంలోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులు, విద్యార్థినుల ప్రవేశాల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.

160 మంది విద్యార్థులకు గాను 95 మంది విద్యార్థులు ఉన్నారని తెలుపగా, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు 100 శాతం నమోదయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమ ను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులో నల్లమల్ల అటవీ ప్రాంతంలోని విద్యార్థినిలకు ఏఐ ఆధారిత విద్యను అందించేలా విద్యార్థినుల ప్రవేశాలు మరింత పెరిగేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఈ కోర్సు ద్వారా విద్యార్థినులకు భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలను వివరించి, వారిని ప్రోత్సహించాలని సూచించారు.

పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులు తెలుగు సబ్జెక్టులో రాస్తున్న స్లిప్ టెస్టును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థినుల వద్దకు వెళ్లి పరీక్ష రాస్తున్న తీరును, ప్రశ్నలకు సమాధానాలు రాసే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రతి విద్యార్థినిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

విద్యార్థినులకు పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తూ, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి అదనపు బోధన అందించాలని సూచించారు. కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, విషయ పరిజ్ఞానం పెంపొందించుకునేలా బోధన సాగాలని కలెక్టర్ సూచించారు.

విద్యార్థినులకు అందిస్తున్న భోజన సౌకర్యాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన భోజనం అందించాలని సూచించారు. వంటశాల, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కేజీబీవీలో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థినుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ వెంట నడింపల్లి గ్రామ సర్పంచ్ గోపి పద్మ, మండల విద్యాధికారి శ్రీనివాస మూర్తి, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులను అందించాలి

ఎల్ నీనోతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి : సిపిఐ మిర్యాలగూడ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించి డిఎఓ జెశ్రీనివాస్ శర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వర్షం లేక బోర్ల కింద బావుల కింద వరి నాట్లు వేసి 75శాతం రైతులు నష్టపోయారని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలని వర్షాధార పత్తి, మిర్చి ఎండిపోవటం వలన రైతులు పూర్తిగా నష్టపోయారని, కరువు మండలాలకు భేషరతుగా ఆర్థిక సాయం, ఉపాధి పనులు, అందించాలని పత్తి మిర్చి ఎండిపోయిన రైతులకు 50 వేల రూపాయల నష్టపరిహారం వరి ఎండిపోయిన రైతులకు 30 వేల నష్టపరిహారం అందించాలని సిపిఐ డిమాండ్ చేస్తూ ఉన్నది ఈ ఏడాది వర్షాలు లేక చాలామంది రైతులు సాగు చేయలేదు సాగు చేయని రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు పూర్తిస్థాయిలో వడ్డీ తీసివేసి తిరిగి అదే రైతులకు రీ షెడ్యూల్ చేయాలని, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కరువు విలయతాండం చేస్తున్నదని ప్రజలకు రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులు ఉచితంగా అందించాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు వారం రోజుల క్రితం వచ్చిన పిడుగుల గాలి వాన వలన బోర్ల కింద బావుల కింద వేసిన కొద్దిపాటి పంటలు ఆ వర్షంతో నేలమట్టం కావడం జరిగిందని వాటిని అధికారులు పరిశీలించి అంచనా వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ధర్నాలో మండల కార్యదర్శులు ఏ.రామలింగం, పి.ఉదయ్ కుమార్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి డి.లింగనాయక్ మహిళా సమాఖ్య నాయకులు డి.దుర్గమ్మ, డి.శాంతి, ఈ ప్రమీల, జమ్ముల కోటయ్య, ఎస్కే రహీం, మర్రి తిరుపతయ్య, కట్ట ఇద్దయ్య, గువ్వల మట్టయ్య, ఎస్ రాములు, నరేష్, పి.లక్ష్మయ్య సైదులు, లక్ష్మమ్మ, కోటేష్, సిహెచ్ రాములు, భిక్షశీ, స్వామి గురువయ్య పాల్గొన్నారు.

గీతంలో రఫ్ సెట్..
సిద్ధాంతంపై కార్యశాల...

కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ రంగాలలో అనిశ్చితిని పరిష్కరించడానికి సూచనలు



పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి: వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సైన్స్ (డీఎస్) రంగాలలో అనిశ్చితిని పరిష్కరించడానికి, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి విద్వత్ మార్పిడిని ప్రోత్సహిస్తూ, వినూత్న విధానాలను ప్రోత్సహించే అర్థవంతమైన ఒకరోజు కార్యశాలను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ (జీఎస్ఎస్) మంగళవారం నిర్వహించింది. రఫ్ సెట్ సిద్ధాంత వ్యవస్థాపకుడైన ప్రముఖ గణిత, కంప్యూటర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జిడ్జిస్లావ్ పావ్లాక్ (1926–2006) జన్మ శతాబ్దిని పురస్కరించుకుని, జీఎస్ఎస్ లోని గణిత, గణాంక శాస్త్ర విభాగం 'ఏఐ, డీఎస్ కోసం రఫ్ సెట్ సిద్ధాంతం' శీర్షికన దీనిని ఏర్పాటు చేసింది.

అనిశ్చితిలో తార్కికత యొక్క గణిత పునాదులకు ప్రొఫెసర్ పావ్లాక్ చేసిన మార్గదర్శక కృషిని గౌరవించడం, సమకాలీన కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ లో రఫ్ సెట్ సిద్ధాంతం యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ కార్యశాల ముఖ్య ఉద్దేశం. ఈ కార్యశాలలో హైదరాబాదు విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ మాజీ సీనియర్ ప్రొఫెసర్ సి.ఆర్. రావు; అదే విభాగానికి చెందిన ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్ మోయిజ్; ఇండక్షన్, గ్రాన్యులర్ కంప్యూటింగ్, నాలెడ్జ్ డిస్కవరీ, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ కోసం హైబ్రిడ్ రఫ్ సెట్ మోడళ్ల యొక్క ప్రాథమిక భావనలు, గణిత పునాదులను ఈ కార్యక్రమంలో వివరించారు. ఈ చర్చలు, అభివృద్ధి చెందుతున్న పరిశోధన ధోరణులను, కృత్రిమ మేధస్సు, తెలివైన నిర్ణయాలు తీసుకోవడంలో రఫ్ సెట్ ఆధారిత విధానాల యొక్క సంభావ్య అనువర్తనాలను కూడా ప్రముఖంగా ప్రస్తావించారు.

హైదరాబాదులోని ఎంజీఐటీ లోని సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.వి. రజనీకాంత్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వారు రఫ్ సెట్ సిద్ధాంతం యొక్క సైద్ధాంతిక పునాదులు, అభివృద్ధి చెందుతున్న అనువర్తనాలపై తమ జ్ఞానాన్ని, పరిశోధన అనుభవాలను, విలువైన అంతర్దృష్టులను సదస్యులతో పంచుకున్నారు.

సాంకేతిక సమావేశాలలో రఫ్ సెట్ సిద్ధాంతం యొక్క ప్రాథమిక భావనలు, గణిత పునాదులు, అట్రిబ్యూట్ రిడక్షన్, ఫీచర్ సెలక్షన్, రూల్





వివిధ విభాగాలకు చెందిన అధ్యాపక సభ్యులు, పరిశోధకులు, పీజీ విద్యార్థులు ఈ కార్యశాలలో పాల్గొని, నిపుణులతో సంభాషించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం భావనాత్మక అవగాహనను బలోపేతం చేయడానికి, తెలివైన డేటా విశ్లేషణలో ఆచరణాత్మక అనువర్తనాలను అన్వేషించడానికి, అంతర్ విషయ పరిశోధన, సహకారాన్ని పెంపొందించడానికి ఒక విలువైన వేదికను అందించింది. ఈ కార్యశాల ప్రారంభోత్సవానికి జీఎస్ఎస్ డైరెక్టర్ డాక్టర్ ఎం. రెజా అధ్యక్షత వహించారు. గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్ దీనిని నిర్వహించగా, డాక్టర్ డి. మల్లికార్జున రెడ్డి, డాక్టర్ నాయర్ రమ్య రవీంద్రన్ సమన్వయం చేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన..

అంజన్న గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

200 మందికి నేత్ర పరీక్షలు..

35 మందికి శస్త్రచికిత్స..



కోదాడ, అక్షిత ప్రతినిధి: కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి ప్రోత్సాహంతో కోదాడ 30 వ వార్డు కౌన్సిలర్ కారింగుల ఉమ అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ శిబిరంలో మొత్తం 200 మంది పాల్గొని నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్య పరీక్షల అనంతరం 35 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన వైద్యులు,వారికి చికిత్స చేశారు.



పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం పలువురికి ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

సామాజిక బాధ్యతతో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన కౌన్సిలర్ కారింగుల అంజన్ గౌడ్ కృషిని పలువురు అభినందించారు.ఇటువంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని స్థానికులు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో చలిగంటి ప్రసాద్,పంది తిరపయ్య ఎన్సిహెచ్ రాము,రాపోలు శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్,పంగవీటి శేఖర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మిట్టకోలు కమలాకర్,చలిగంటి రంగా, తంగెళ్ళపల్లి లక్ష్మణ్, మల్లయ్య, స్టాలిన్,నర్సి, శివ, శేషు,నజీర్, రవి తదితరులు పాల్గొన్నారు

స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



కరీంనగర్ అక్షిత బ్యూరో: స్పెషల్ బ్రాంచ్ (ఎస్.బి) కార్యాలయాన్ని మంగళవారం పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, వివిధ విభాగాలను పర్యవేక్షించే అధికారులు మరియు సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ప్రధానంగా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, ఉద్యోగ (జాబ్) ధ్రువీకరణ, పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల (పివిసి) జారీ ప్రక్రియపై ఆరా తీశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, నిర్దేశిత గడువులోగా నిక్కచ్చిగా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి ధ్రువపత్రాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. అలాగే సోషల్ మీడియా విభాగం పనితీరు, ఫీల్డ్ అధికారుల కార్యాచరణపై సమీక్షించి, క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సమాచార సేకరణను వేగవంతం చేయాలని ఫీల్డ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులపై సత్వరమే స్పందించాలని పలు కీలక సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీ, సమీక్షా సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ అనిల్, డి.ఎ.వో. విరాజ్ తో పాటు ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా ఎం. చత్రు బాధ్యతల స్వీకరణ



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: మహబూబ్‌నగర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్) ఎం. చత్రు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్.ఏ.సి.) స్వీకరించారు. మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎం. చత్రు మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో మైనార్టీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరవేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించడం తనకు ఇదే మొదటిసారి అని పేర్కొన్న ఆయన, ఈ బాధ్యతలను ఒక అవకాశంగా భావించి పూర్తి నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తానని, జిల్లా కలెక్టర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. అంతకుముందు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ విజయలక్ష్మి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారి ఎం. చత్రుకు స్వాగతం పలికి, కార్యాలయ సిబ్బందిని పరిచయం చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: పాలమూరు ప్రాంత అభివృద్ధి, రైతుల సంక్షేమం, సాగునీటి సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, విద్యారంగ విస్తరణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.9,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు రైతు పండుగ నిర్వహించారని తెలిపారు. తన పుట్టినరోజును కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్న అనంతరం, మిగిలిన సమయాన్ని ప్రజా అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించారని పేర్కొన్నారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మూల వనరును జూరాల నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్స్‌కు మార్చడం ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పశ్చిమ మహబూబ్‌నగర్ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. రూ.2,000 కోట్ల అంచనా వ్యయంతో మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామని, లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఉద్దండాపూర్ రిజర్వాయర్ భూసేకరణ కోసం రూ.600 కోట్లు విడుదల చేశామని, మక్తల్ వద్ద సంఘంబండ రిజర్వాయర్‌కు ఉన్న అడ్డంకులను తొలగించి నీటి విడుదలను పునరుద్ధరించామని వివరించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకే పరిమితం చేయడం ద్వారా గత ప్రభుత్వం రాష్ట్ర నీటి హక్కులకు నష్టం కలిగించిందని ఆరోపించారు.

కొడంగల్ ప్రాంతంలో 5,000 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని, భూములు అందిస్తున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందించామని యెన్నం తెలిపారు. ఎల్‌అండ్‌టీ, బిర్లా వంటి ప్రముఖ సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. రూ.5,000 కోట్ల అంచనా వ్యయంతో 250 అడుగుల వెడల్పు, ఎనిమిది వరుసల ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే శంషాబాద్ విమానాశ్రయం నుంచి కొడంగల్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు సుమారు గంటా పది నిమిషాల్లో చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నారాయణపేట--కొడంగల్ ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి 250 ఎకరాల్లో మెడికల్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలలతో ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని యెన్నం తెలిపారు. ఈ విద్యా సంస్థల ద్వారా స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భవిష్యత్తుకు అవసరమైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. లక్ష కోట్ల రూపాయలతో మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మించిన గత ప్రభుత్వం పాలమూరు పశ్చిమ ప్రాంతానికి పదేళ్లలో సాగునీరు అందించడంలో విఫలమైందని యెన్నం విమర్శించారు. 365 రోజుల్లో 300 రోజులు ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్, ముఖ్యమంత్రి కొడంగల్‌లో మూడు రోజుల పర్యటన చేపడితే బీఆర్ఎస్ నాయకులు రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి తక్కువని, ప్రచారం మాత్రం ఎక్కువగా చేసుకుందని ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో అసెంబ్లీలో కరోనా ఏమీ లేదన్నట్లుగా వ్యవహరించిన కేసీఆర్ వైఖరి ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చిందని యెన్నం విమర్శించారు. ప్రస్తుతం నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ముందస్తు జాగ్రత్తలు సూచిస్తున్నారని తెలిపారు. ఇలాంటి కీలక అంశాలపై బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేయడం తగదన్నారు. కల్యాణలక్ష్మి, రైతు భరోసా, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులతో పాటు ఆసుపత్రులకు లైన్ ఆఫ్ క్రెడిట్ నిధులను నిరంతరం ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమం, ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, రైతులకు సాగునీరు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

త్రాగునీటి సమస్య కోసం కృషి

కొత్త బోర్డు డ్రిల్లింగ్‌తో పాటు నూతన మోటర్ అమర్చడం

గ్రామ సర్పంచ్ అతినారపు శివకుమార్



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: తాగునీటి సమస్య కోసం కృషి చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ అతినారపు శివకుమార్ తెలిపారు . మంగళవారం లింగాల మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో త్రాగునీటి సమస్య రాకుండా కొత్త బోర్డు డ్రిల్లింగ్ తో పాటు నూతన బోరు మోటర్ అమర్చడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు రాకముందు ఈ యొక్క పాత బోర్ ఉన్నదని అట్టి ప్లేస్ లో మోటర్ కాలిపోవడంతో నూతన కొత్త మోటర్ మరియు బోరు డ్రిల్లింగ్ చేయడం జరిగింది. నీటి సమస్య గ్రామంలో ఉండకుండా ఎప్పటికప్పుడు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అదేవిధంగా గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడుతూ గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. గ్రామంలో ప్రజలందరూ కూడా ఇండ్ల మధ్యల చెత్త చెదారం లేకుండా ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గుద్దటి కృష్ణయ్య. మాజీ ఎంపీటీసీ ప్రస్తుత వార్డు సభ్యులు మాచర్ల సుధీర్ గౌడ్. అతినారపు శ్రీనివాసులు, వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి పాండు నాయక్, దేరెగులా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి

బాలికలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

విద్యార్థినుల రక్షణే లక్ష్యం

ఆపదలో 100, 112కు ఫోన్ చేయాలి

మహిళలు, విద్యార్థినుల భద్రతపై షీ టీం అవగాహన కార్యక్రమం



తొర్రూరు అక్షిత న్యూస్: మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని తొర్రూరు సబ్ డివిజన్ షీ టీం సభ్యులు స్వాతి, కుమారస్వామి సూచించారు. మహిళల భద్రత, రక్షణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్టాండ్లు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, రద్దీగా ఉండే రహదారులు, కూడళ్ల వద్ద మహిళలు, ముఖ్యంగా విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఈవ్‌టీజింగ్, ఇతర వేధింపుల గురించి వివరించారు. మంచి స్పర్శకు, చెడు స్పర్శకు మధ్య ఉన్న తేడాలను విద్యార్థులకు తెలియజేశారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేయాలని, అలాగే టీ సేఫ్ యాప్ ద్వారా షీ టీంకు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, ఉపాధ్యాయులు సరిత, సునీత, ప్రవీణ్‌కుమార్, శిరీష, సతీష్, ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ ఝాన్సీతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో మహిళా సంఘాలకు ప్రోత్సాహం

దుబార్‌పేట్ సర్పంచ్ కాళ్లే ప్రవీణ విఠల్

డ్వాక్రా భవన నిర్మాణ పనులకు భూమి పూజ



ఇచ్చోడ అక్షిత న్యూస్: ప్రజా ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు మహిళా సంఘాలకు అవసరమైన సదుపాయా లు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని దుబార్ పేట గ్రామ సర్పంచ్ కాళ్లే ప్రవీణ విఠల్ అన్నారు. మండలం లోని దుబార్‌పేట్ గిరిజన గ్రామంలో మంగళవారం డ్వాక్రా మహిళ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడారు. మహిళా సంఘం భవనానికి రూ. 10 లక్షల నిధులను మంజూరు చేసిందని చెప్పారు. మహిళా సంఘా లకు సొంత భవనం అందు బాటులోకి వస్తే సమావేశా లు నిర్వహించుకోవడంతో పాటు స్వయం ఉపాధి, ఆర్థి క స్వావలంబన, మహిళా సాధికారతకు సంబంధిం చిన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళా సంఘం భవనం గ్రామీణ మహిళల అభివృద్ధికి ఎంతో దోహదప డుతుందని ఆమె ఆశాభా వం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో ఉప సర్పంచ్ సిదం ఆనంద్ రావు, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, సీసీ మైమున్ బీ, వివోపీ మమత వివో గ్రామ అధ్యక్షురాలు వెడ్మ కమల నాగు బాయి, డ్వాక్రా సంఘాల మహిళలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొ న్నారు.

భూ రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ

మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:



మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ, మహబూబ్‌నగర్ రూరల్ మండల తహసీల్దార్‌తో కలిసి జన్నప్పపల్లి గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు పూర్తయిన భూ సర్వే విస్తీర్ణం, ఇంకా సర్వే చేయాల్సిన భూముల వివరాలను డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మరియు మండల సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు వ్యవసాయ భూములు, ప్రభుత్వ భూములు తదితర భూముల వివరాలు, వాటి విస్తీర్ణాలు, సరిహద్దులు, యాజమాన్య వివరాలను ఇప్పటికే ఉన్న రెవెన్యూ రికార్డులతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి పరిశీలించారు. భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణాలు, యాజమాన్య వివరాలు, భూముల వర్గీకరణను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ రికార్డులు మరియు క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలను క్షుణ్ణంగా సరిచూసి, సర్వే డేటాలో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే సమయంలో రైతులతో సమన్వయం చేసుకోవాలని, వారి సందేహాలు మరియు అభ్యంతరాలను సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం పరిష్కరించాలని తెలిపారు. భూముల వివరాల నమోదులో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేదా వివరాల గల్లంతు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితత్వంతో, క్రమబద్ధంగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి కొలతలు మరియు రెవెన్యూ రికార్డుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఖచ్చితమైన భూ రికార్డుల నిర్వహణ ద్వారా భూ పరిపాలనలో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు.